క్లుప్తంగా

గోతులమయం



గోతులమయంగా మారిన జరజాం రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం పంచాయతీలోని గొల్లవానిపేట, చిన్నకొయ్యివానిపేట గ్రామాల మీదుగా వెళ్లే తారు రోడ్డు పూర్తిగా గోతులు మయంగా మరింది. చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మూడు కిలో మీటర్ల మేర రోడ్డు పూర్తిగా గోతులు మయంగా మారింది. మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఎత్తుకు పైఎత్తు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

రణస్థలం: మండలంలోని రణస్థలం ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా క్రీడా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో చదరంగం (చెస్), వైకుంఠపాళీ తదితర ఆటలను ఆడించారు. ఎంఈఓ బోనెల లావణ్య, వ్యాయమ ఉపాధ్యాయరాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డుల్లే వాహనాలను సీజ్ చేస్తాం



వాహనదారులకు హెల్మెట్‌ధారణపై సూచనలిస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్: రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామని శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఎం.అవతారం వాహన యజమానులను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఉత్తర్వుల మేరకు ప్రతీ ఒక్కరికీ హెల్మెట్ ధారణ తప్పనిసరంటూ ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం సీఐ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిబుల్ డ్రైవింగ్, మైనర్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి చేసినా అందులోనూ విత్‌అవుట్ లైసెన్స్, ఇన్సూరెన్సు (బండికీ, వ్యక్తికి) లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సందీప్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత



రణస్థలం పంచాయతీని సందర్శిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

రణస్థలం: పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే అందులో ప్రజల సహకారం ఎంతో అవసరమని డీపీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని రణస్థలం పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీని సందర్శించారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలన్నారు. లేనివారు త్వరతగతిన నిర్మించుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా రిక్షాల్లో వేయాలన్నారు. ఎంపీడీఓ రమణమూర్తి, ఈఓపీఆర్‌డీ ప్రభాకరరావు, సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 26వ ఎచ్చెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీలో మరమ్మతులు చేయనున్నట్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. విద్యుత్ లైన్లుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించటం, ఇతర లైన్లు మరమ్మతులను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎచ్చెర్ల మండల కేంద్రం, అనమిత్ర టౌన్‌షిప్ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: ఈ నెల 26న మండలంలోని రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవరసర మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జే.ఆర్.పురం, రణస్థలం, గరికిపాలెం, బావరాజుపాలెం, దన్నానపేట, గొల్లపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చినుకుపడితే నడకయాతన..



వరంకాలనీ ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు



సత్యసాయినగర్ -7వ లైన్‌లో నిలిచిన వరద



అధ్వానంగా ఉన్న సత్యసాయినగర్ ఏడో లైన్ దారి

శ్రీకాకుళం నగరంలోని వరం కాలనీ వాసులు సరైన రోడ్డు లేక అవస్థలు పడుతున్నారు. కాలనీకి సమీపంలో ఉన్న సత్యసాయినగర్‌కాలనీ-7వ లైన్‌కు పూర్తిగా రహదారి లేదు. దీంతో చినుకుపడితే చెరువులా తయారవుతుంది. స్థానికులే డబ్బులు వేసుకుని పాతభవనాల వ్యర్థాలను తీసుకొచ్చి నడకదారిగా ఏర్పాటు చేసుకున్నారు. నగరంలో ఉన్నప్పటికీ ఈ ప్రాంతం మారుమూలన ఉన్నట్టు ఉంటుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధాన రహదారిలో వర్షంనీరు నిలిచిపోయి అటువైపుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాపురం, పాత్రునివలస, డెంటల్‌కాలేజీకి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. పొట్టకూటికోసం నగరానికి వచ్చేవారికి కూడా ఈ రోడ్డే ఆధారం. చిన్న చినుకుపడిన గోతుల్లో నీరుచేరుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

-శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

దివ్యాంగుడికి మూడు చక్రాల కుర్చీ వితరణ



చక్రాల కుర్చీని వితరణ చేస్తున్న జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: అంగవైకల్యంతో యాచన చేస్తున్న వ్యక్తికి మూడు చక్రాల కుర్చీని అందజేసి రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మానవత్వాన్ని చాటుకున్నారు. కృష్ణాపార్కు వద్ద అచ్యుతరావు (41) ఒంటి కాలుతో నడుస్తూ యాచన చేస్తుండగా చూసిన ఆయన చలించిపోయారు. విషయాన్ని రెడ్ క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, జి.పవన్ కుమార్‌లకు బుధవారం తెలియజేశారు. దీంతో కృష్ణాపార్కు వద్దకు వెళ్లి అచ్యుతరావును రెడ్ క్రాస్ కార్యాలయానికి తీసుకొని వచ్చారు. శరీరానికి సపర్యలు చేసి కొన్ని జతల దుస్తులను అందించారు. అతని కోరిక మేరకు సపోర్టింగు స్టాండు, మూడు చక్రాల కుర్చీని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటువంటి వారు నగరంలో ఎవరికైనా తారస పడితే తమకు తెలియచేయాలని జగన్మోహనరావు కోరారు. రెడ్‌క్రాస్ మేనేజర్ సతీష్, జి.రమణ, డాక్టర్ చిరంజీవి, సీఎస్ఆర్ఎంఓ శివ ప్రకాష్, బీఎస్సీ మెడికల్ ఆఫీసర్, రెడ్ క్రాస్ సభ్యులు సత్యం నాయుడు, సత్యన్నారాయణ, ఉర్లం శివతేజ ఉన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకికి ఘన నివాళి



శ్రీకాకుళం అర్బన్: వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయాల ఏర్పాటు కోసం అయ్యంకి వెంకటరమణయ్య విశేషంగా కృషి చేశారని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ హడ్కో కాలనీలోని గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమకారుడైన అయ్యం 134వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అయ్యంకి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు

లావేరు శాఖా గ్రంథాలయంలో

ఎచ్చెర్ల: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని లావేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేశారన్నారు. అయన జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకుగా బహుమతులు అందించారు. గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో..



శ్రీకాకుళం అర్బన్: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర గ్రంథాలయ సిబ్బంది

అయ్యంకి వెంకటరమణయ్య జయండి కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కూడా నిర్వహించారు. జిల్లా కేంద్రగ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, పాఠకులు అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యంకి వెంకటరమణ జులై 24, 1890లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా, బిక్కవోలు మండలంలో జన్మించారని గుర్తు చేశారు. గ్రంథాలయ ఉద్యమకారుడుగా, గ్రంథాలయ పితామహుడుగా అయ్యంకి పేరుగాంచారని అన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది ప్రత్యూష, రామమోహన్, రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అరసవల్లి: శ్రీకాకుళం నగరం, శ్రీకాకుళం రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 26వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్న ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో 11 కేవీ టౌన్-2 ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా డే అండ్ నైట్ జంక్షన్, ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డు, రైతు బజార్ రోడ్డు, చినబజార్ రోడ్డు, ఎంపీడీఓ ఆఫీసు ఏరియా, పుణ్యపువీధి తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తామన్నారు. అలాగే శ్రీకాకుళం నగర పరిధిలో 11 కేజీవీ కలెక్టర్ ఆఫీస్ ఫీడర్ పరిధిలో కూడా మరమ్మతులు చేపడున్నట్టు పేర్కొన్నారు. దీంతో వాంబేకాలనీ, కలెక్టర్ ఆఫీస్, డీఆర్‌డీఏ, కలెక్టర్ బంగ్లా ఏరియా ప్రాంతాల్లో, ఏపీహెచ్‌బీ కాలనీ, సాయిగిరి ఏరియా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని చెప్పారు. అలాగే శ్రీకాకుళం రూరల్ మండలం ఆమదాలవలస రూరల్ ఫీడర్ పరిధిలో 11 కేవీ ఒప్పంగి ఇండస్టియల్ ఫీడర్ పరిధిలో లైన్లను మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ఒప్పంగి గ్రామం, ఒప్పంగి గ్రామ పరిశ్రమలు, లింగాలవలస రైస్ మిల్లులు (గార మండలం) ప్రాంతాల్లో కూడా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పైపులు, ట్యాంక్ ధ్వంసంపై ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు పొన్నాడ మధుసూదనరావు తోటపాలెం సమీపంలో వేదవ్యాస రామానుజ విద్యా ఆశ్రమం నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ ఆశ్రమంలో పనిచేస్తున్న పందిరి గోవిందమ్మ, కుమారుడు సాయికిరణ్‌లు ఈ నెల 16వ తేదీన ఆశ్రమంలోని రన్నింగ్ ప్లంబింగ్ పైపులు, ట్రాంక్‌లు ధ్వంసం చేశారని గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య పరిష్కారం కాకపోవటంతో బుధవారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. ఆశ్రమాన్ని పరిశీలించి దర్యాప్తు చేశారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తృతమవ్వాలి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి



లయన్స్ క్లబ్ డైరీని ఎస్పీకి అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్: లయన్స్‌క్లబ్ సెంట్రల్ సేవలు మరింత విస్తృతం కావాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరరెడ్డిని లయన్స్‌క్లబ్ సెంట్రల్ ప్రతినిధులు తన కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్లబ్ అందించే సేవల్లో ఉచిత ప్రజారోగ్య సెంటర్ నడపడం గొప్పదని, వర్షాకాలంలో ఎక్కువ మొక్కలు నాటే కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ ఆవరణలో, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటే బాధ్యత తీసుకుని పర్యావరణం ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు బొడ్డేపల్లి సురేష్, లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డీసీ డాక్టర్ బి.దేవభూషణం, సెక్రటరీ పైడి సింధూర, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్ ఉన్నారు.

4న మహా ధారణావధానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో వచ్చేనెల నాలుగో తేదీన పోతన భాగవతములో దశమస్కందం పూర్వ భాగంలోని సుమారు 1800 పద్య గద్యములపై 'మహా ధారణావధానం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మందిరం నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధారణ కర్తగా విశాఖకు చెందిన ఓరుగంటి రాజేశ్వరీ ప్రసాద్ వ్యవహరిస్తారని, మరో ఎనిమిది మంది ప్రాశ్నికులతో జరిగే కార్యక్రమంలో ప్రాశ్నకులు పద్యంలోని మొదటి పాదం, గద్యంలో మొదటి నాలుగు లైనుపదాలు చెపితే ధారణ కర్త మిగిలినవి పూర్తి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీని పరిరక్షించుకుందాం



ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేయకుండా చూస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంబంధిత అధికారులు అన్నారు. శ్రీకాకుళంలో కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డుపై అధికారులు, సిబ్బంది బుధవారం ఆర్టీసీ పరిరక్షణ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేయకుండా అడ్డుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను ఎక్కించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కాంప్లెక్స్ సమీపంలోనే ప్రైవేటు వాహనాలను ఎక్కించుకుని ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. ప్రైవేటు వాహనాలు కాంప్లెక్స్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో నిలపాలని ఆర్‌టీఏ చట్టంలో ఉందని, దీన్ని ప్రైవేడు వాహనదారులు అతిక్రమించకుండా ఆర్‌టీఏ అధికారులతో కలిసి ఆర్టీసీ పరిరక్షణ పేరుతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు వి.రమేష్, ఎ.గంగరాజు, రాజు, ఐఎస్ రావు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, పి.వి.ఎస్.ప్రసాద్, రమేష్, పట్నాయక్, ఆనంద్, నగేష్, శంకర్, సెక్యూరిటీ సిబ్బంది పీఆర్‌కె రావు, సూరప్పడు, తోటయ్య ఉన్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు



ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జేడీ సురేష్‌బాబు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.వి.మహేశ్వరరెడ్డిని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లాల ప్రాంతీయ విజిలెన్స్ అధికారి, జేడీ ఎ.సురేష్‌బాబు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర రెడ్డి, సెబ్ శ్రీకాకుళం డివిజన్ ఎన్‌ఫోర్స్ సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు, శ్రీకాకుళం ఆర్టీసీ రెండు డిపోల మేనేజర్లు మల్లికార్జునరాజు, శర్మ తదితరులు ఉన్నారు.

ఆగస్టు 30, 31 తేదీల్లో సెమినార్



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 30, 31 తేదీల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజిని తెలిపారు. ఈ మేరకు బుధవారం సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విభాగం నుంచి జాతీయ స్థాయి సెమినార్లు నిర్వహించాలని సూచించారు. వీటి వల్ల విజ్ఞాన మార్పిడి, విషయ పరిజ్ఞానం, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు పట్టు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ కూన అచ్యుతరావు, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

తలనీలాల వేలం మళ్లీ వాయిదా

అరసవల్లి : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన కేశఖండన శాలలో తలనీలాల పోగులకు హక్కులకు గాను నిర్వహించిన వార్షిక టెండర్ మరోసారి వాయిదా పడింది. బుధవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం ప్రక్రియలో మొత్తం 15 మంది పాటదారులు పాల్గొన్నా గత ఏడాది పాట రూ.90 లక్షల కంటే ఈసారి కూడా తక్కువగా పాట కోట్ చేయడంతో నిబంధనల ప్రకారం ఈ పాటను వాయిదా వేస్తున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్, పర్యవేక్షణాధికారి గురునాథరావు ప్రకటించారు. ఇక్కడికి వచ్చిన పాటదారులు సిండికేట్ అయిపోయి తక్కువ పాట పాడేందుకు నిర్ణయించుకోవడంతో నిబంధనల ప్రకారం ఆలయానికి ఆదాయానికి గండి పడుతున్నందున పాట వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి 24 వరకు పోగుగా ఉన్న తలనీలాల స్టాక్ (576 కేజీల 630 గ్రాములు) కు కూడా ప్రత్యేకంగా నిర్వహించిన వేలం పాటలో మొత్తం 13 మంది పాల్గొనగా..గరిష్ఠ పాటదారునిగా శ్రీ వల్లీ ఎంటర్‌ప్రైజెస్ ఏలూరు కంపెనీ కేజీకి రూ.5,935 చొప్పున మొత్తం రూ.34,18,500లను హెచ్చుపాటగా నిర్ణయించారు.

'ఎస్సీ వర్గీకరణ చేయాలి'



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ గత నెల 30వ తేదీ నుంచి గ్రామగ్రామాన ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెడతామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాటిచ్చారని.. దాన్ని నిలబెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. మాదిగ దండోరా జెండాను ప్రతి గ్రామంలో ఎగుర వేయాలన్న ఆలోచనతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రతినిధులు దాసరి తిరుమలరావు, కంటిపాక హిమశేఖర్, దీర్ఘాసీ తిరుమల, గణబాబు, గొంటి పోలయ్య, బోదల సింహాద్రి, పాండురంగరావు ఉన్నారు.

నృత్య గురువుకు సత్కారం



గురువు శ్రీకాంత్‌తో శిష్యుల బృందం

శ్రీకాకుళం కల్చరల్:

శివశ్రీ నృత్య నికేతన్ నృత్య దర్శకులు రఘుపాత్రుని శ్రీకాంత్‌ను ఆయన శిష్యులు ఘనంగా సత్కరించారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వయోలిన్ విద్వాంసులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ మాట్లాడుతూ.. ఎంతో మందిని నృత్యకారులుగా తీర్చిదిద్దన వ్యక్తి శ్రీకాంత్ అని కొనియాడారు. దేశ, విదేశాలలో ప్రదర్శనల ద్వారా ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందారని అన్నారు. రిమ్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు లావేటి శ్యామ్‌సుందరరావు, విజయభాస్కర్, నగేష్ స్వామి, సాయికుమార్ ఉన్నారు.

ఖాళీ స్థలాల పరిశీలన



బ్యాంకర్స్ కాలనీలో ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఓబులేసు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ఖాళీగా ఉన్న పలు స్థలాలను నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం సందర్శించారు. 'ఖాళీస్థలాలు.. వ్యాధులకు వేదికలు' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. బ్యాంకర్స్‌కాలనీ, ఏఎస్ఎన్‌కాలనీ, విశాఖ-ఎ, బీ కాలనీలు సందర్శించారు. స్థల యజమానులు, చుట్టపక్కలవారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలాన్ని రోడ్డుకంటే ఎత్తు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు పిచ్చిమొక్కలు తొలగించాలని, చుట్టూ ప్రహరీ నిర్మించుకోవాలని సంబంధిత యజమానులకు సూచించారు. ఖాళీ స్థలానికి కూడా విధిగా పన్ను చెల్లించాలని.. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్...

• నదీ తీర ప్రాంతాలు ..



లావేటిపేట వద్ద నాగావళి నదీతీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: నీటి పారుదల శాఖ కనస్ట్రక్షన్ డీఈ ఎ.శ్రీనివాసరావు, పలువురు అధికారులు ఎచ్చెర్ల మండలంలోని బొంతల కోడూరు, లావేటిపేట, కాళింగపేట, పొన్నాడ పంచాయతీలోని పలు గ్రామాల్లో నాగావళి నదీ తీరం ప్రంతాలను బుధవారం పరిశీలించారు. ఈ నెల 21వ తేదీన సాక్షిలో 'తరిగి పోతున్న తీరాలు' అన్న కథనంపై అధికారులు స్పందించారు. ప్రస్తుతం నాగావళి నదీ తీరంలో కోత, గతంలో నిర్మించిన గ్రోయన్ల పరిస్థితి, కోతకు ఎక్కుగా గురవుతున్న పాంతాలు వంటివి పరిశీలించారు. స్థానిక సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల జగదీశ్వరరావు అధికారులకు సమస్య వివరించారు. నది ఉధృతంగా ప్రవహించే సమయాల్లో లావేటిపేట, కాళింగపేటలకు సమస్య ఉందని, భూములు కోతకు గురవుతున్నాయన్నారు. ప్రస్తుతం కోత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాతి కట్టడాలు, గ్రోయిన్లు నిర్మించాలన్నారు. నదీ తీరంలో కోత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి గ్రోయిన్ల ఏర్పాటుకు అంచనాలు రూపొందిస్తామని అధికారులు తెలిపారు. జేఈలు కార్తీక్, యశ్వంత్ పాల్గొన్నారు.